# కల'వరం'

- తాటికోల పద్మావతి

సాయంత్రం ఐదు గంటలైంది. ట్రైన్ స్టేషన్‌లో ఆగగానే దిగాల్సిన జనం అంతా దిగిపోతున్నారు. విశ్వనాథం చేతిలో ఒక చిన్న సంచీ పుచ్చుకుని రైలు కమ్మీ గట్టిగా పట్టుకుని మెల్లగా రైలు దిగాడు. స్టేషన్ బయటికి రాగానే ఆటో కావాలా, రిక్షా కావాలా అంటూ ఎగబడ్డారు. ఒకసారి జేబులో వున్న అడ్రస్ కాగితం బయటికి తీసి చదువుకున్నాడు. మరో నాలుగడుగులు వేసి బయటకి వచ్చాక రిక్షా మాట్లాడుకుని ఎక్కాడు. విశ్వనాథం చెప్పిన అడ్రస్ ప్రకారం రిక్షా సత్యనారాయణపురం శివాలయం వీధిలో ఆగింది. విజయవాడలో ఆమాత్రం అడ్రస్ కనుక్కోలేడా. కళ్లజోడు సరిచేసుకుంటూ సందు మొదట్లో అపార్ట్‌మెంటులో మూడో ఫ్లోర్‌లోకి వెళ్లాడు. మెట్లు ఎక్కి వెళ్లేసరికి కాస్త ఆయాసం వచ్చింది. సరిగ్గా డోర్ నెంబరు అదేనని చూసుకున్నాడు.

లోపల నుంచి హడావిడిగా బయటికి వస్తూ కనిపించాడు వేణు. ఖరీదైన సూటు బూటు వేసుకున్నాడు. చేతికి రిస్ట్‌వాచీ, రెండు వేళ్లకి రెండు ఉంగరాలు, మెడలో గోల్డ్ చైన్ వుంది. చేతిలో సెల్‌ఫోన్. అపుడే ఎవరో ఫోన్ చేసినట్లున్నారు- వాళ్లతో మాట్లాడుతున్నాడు వేణు.

విశ్వనాథంని చూడగానే- ఏమిటంకుల్ ఏదైనా పనిమీద వచ్చారా? నేను అర్జంటుగా బయటికి వెళ్తున్నానంటూ వాచీ వంక చూసుకున్నాడు.

ఇంటికి వచ్చిన పెద్దమనిషిని కూర్చోమని చెప్పలేదు. గ్లాసు మంచినీళ్లు ఇప్పించలేదు. తన **తల్లిదండ్రులు** ఎలా వున్నారా అని వాళ్ల క్షేమ సమాచారాలు కూడా అడగలేదు. చదువుకుని ఉద్యోగం చేస్తున్నాడు. అతనిలో ఏమాత్రం సంస్కారం లేదు. విశ్వనాథం కదలకపోవటంతో వేణుకి చిరాకనిపించింది. అర్జంటుగా వెళ్లాలనుకుంటే మధ్యలో పానకంలో పుడకలాగా ఈయన దాపురించాడేమిటని చూస్తూ- మీరేదైనా మాట్లాడాలనుకుంటే తొందరగా చెప్పండి. ఈ రోజు వృద్ధాశ్రమం ఓపెన్ చేస్తున్నారు. పెద్ద పెద్ద వాళ్లంతా చాలామంది వస్తున్నారు. ఇప్పటికే నా కోసం ఎదురు చూస్తుంటారు. నేను త్వరగా వెళ్లాలన్నాడు.

మళ్లీ ఫోన్ వచ్చింది వేణుకి. ముఖ్య అతిథిగా వస్తానన్న ఎమ్మెల్యేగారు దారి మధ్యలో కారు చెడిపోయింది. ఆయన రావటానికి మరో గంట ఆలస్యం కావచ్చునంటూ తెలియపరిచారు.

తనకి మాట్లాడే అవకాశం దొరికింది అనుకున్నాడు విశ్వనాథం. ఇంతలో టెన్త్‌క్లాస్ చదువుతున్న వేణు పెద్దకొడుకు- నాన్నా, నేను రేపు పిక్నిక్‌కి వెళ్తున్నాను. వెయ్యి రూపాయలు కావాలన్నాడు. అలాగే ఇంకా టైముంది కదా, రేపు ఇస్తాలే అన్నాడు వేణు.

వేణు కుర్చీలో కూర్చుని విశ్వనాథంని కూడా కూర్చోమన్నాడు. ఇంతలో వాకిట్లో ఆగిన ఆటోలో నుంచి వేణు అత్తగారు, మామగారు వచ్చారు.

ఇప్పుడేనా రావటం. ఫోన్ చేస్తే నేనే వచ్చి మిమ్మల్ని రిసీవ్ చేసుకునేవాడిని కదా అన్నాడు వేణు. రెండుసార్లు ఫోన్ చేశాం. లైన్ కలవలేదు. అందుకే మేమే వచ్చాం అన్నారు. ఇప్పుడే వస్తానంటూ వాళ్లను సాదరంగా ఆహ్వానించి లోపలికి తీసుకెళ్లి భార్యతో చెప్పి వచ్చాడు.

తల్లిదండ్రుల కంటే అత్తమామల మీద చూపిస్తున్న గౌరవం చూస్తుంటే వేణు మీద చాలా కోపం వచ్చింది విశ్వనాథంకి.

ఆc ఇప్పుడు చెప్పండి- మరో పావుగంటలో నేను బయలుదేరాలన్నాడు వేణు.

మీ నాన్నగారి పరిస్థితి ఏమీ బాగాలేదు. ఒకసారి నిన్ను చూడాలని కలవరిస్తున్నాడు.

నాలుగు రోజులుగా మూసిన కన్ను తెరవటం లేదు. సరైన వైద్యం లేక లేవలేని స్థితిలో వున్నాడు. ఒకసారి చూసి వెళతావని నేనే స్వయంగా చెప్పి వెళదామనుకున్నాను అన్నాడు విశ్వనాథం.

పెద్దవాళ్లు, ఆమాత్రం రోగాలు రాకుండా ఉంటాయా చెప్పండి. కాస్త జ్వరం వచ్చిందని కంగారుపడి మిమ్మల్ని ఇంత దూరం పంపి నన్ను కంగారు పెట్టకపోతే ఏమైంది. అసలే ఒక్క క్షణం తీరిక లేక బిజీగా వుంటున్నాను. ఎప్పుడో వీలు చూసుకుని వస్తానని చెప్పండి. ఇంతేనా మీరు చెప్పదలచుకుంది. ఇంకా ఏమైనా వున్నాయా అంటూ జేబులో నుండి రెండు వందలు తీసి ఈ డబ్బు తీసికెళ్లి ఇవ్వండి. అవసరమైతే మందులు కొనుక్కుంటారంటూ ఆ డబ్బు విశ్వనాథం చేతిలో పెట్టబోయాడు.

కనీసం ఆ డబ్బుని కూడా తాకకుండా దూరంగా జరిగాడు విశ్వనాథం.

అవసరం లేదు. ఆ డబ్బు కూడా నువ్వే వుంచుకో. నీ అవసరాలకు ఉపయోగపడుతుంది. పాపం నీకు టైం చాలదేమో మీటింగ్‌కి బయలుదేరు. అక్కడ ఎంతోమంది పెద్దలు వస్తారు. అక్కడ నువ్వు చెప్పబోయే ఉపన్యాసం విని అంతా చప్పట్లు కొడతారు. అది నీ విజయానికి గర్వకారణం. అక్కడ చేరిన వృద్ధులందరికీ పాలు, పండ్లు పంచిపెడతావు. వాళ్లందరితో ఎంతో ఆప్యాయంగా కన్నబిడ్డలాగా మాట్లాడతావు. వాళ్లందరూ నీలాంటి కొడుకుంటే బాగుండునని కళ్లనీళ్లు పెట్టుకుంటారు. ఇక్కడ నీ తల్లిదండ్రులు మాత్రం నిన్ను కన్నందుకు కంటతడి పెడుతున్నారు. ఫొటోలు, వీడియోలు తీసి పేపర్లలో నిన్ను గురించి పొగడుతూ వ్రాస్తారు. అది చదివి సమాజం నిన్ను గౌరవిస్తుంది. నువ్వు చేస్తున్న మంచి పనులు చూసి నిన్ను ఆకాశానికెత్తుతారు. వాళ్లని చూసి పొంగిపోతావు. వృద్ధాశ్రమంలో నీ మంచితనానికి నిన్ను పూలదండలతో సత్కరిస్తారు. సమాజంలో నువ్వొక మేకవన్నె పులిగా చెలామణి అవుతున్నావు. ఏనాడైనా నీ తల్లిదండ్రుల్ని గురించి ఆలోచించావా? సెలవు రోజుల్లో వచ్చి ఎప్పుడైనా వచ్చి చూసి పోయావా. వాళ్లని నీ దగ్గరకు తీసుకొచ్చుకుని పట్టుమని పది రోజులైనా ఉంచుకున్నావా. పది నెలలు మోసి కని, పెంచి చదువు చెప్పించబట్టేగా ఇంతటి వాడివయ్యావు. ఏవీ చేయకుండా గాలికి వదిలేస్తే నీ జీవితం ఏమయ్యేదో ఒకసారి ఆలోచించుకో.

విశ్వనాథం మాటలు ఒక్కొక్కటి గుండెల్లో బాణాల్లా గుచ్చుకుంటున్నాయి. ముఖం చిటపటలాడిపోతున్నది.

అయినా ఇతని కెందుకు? నా వాళ్లు నా ఇష్టం. చూస్తే చూస్తాను, లేకపోతే లేదు. నాకు నీతులు చెప్పటానికి వచ్చినట్లున్నాడు.

తల్లిదండ్రులుగా నన్ను కన్నందుకు వాళ్ల బాధ్యత వాళ్లు తీర్చుకున్నారు. చదివించమని, ఉద్యోగం ఇప్పించమని నేనేమన్నా ఏడ్చానా. అలాంటి వాళ్లు ఎందుకు కన్నారో ఒకసారి


## 'పత్రిక' చందా వివరాలు

కొందరు 'పత్రికా'భిమానులు చందా వివరాలు కావాలని ఉత్తరాలు రాస్తున్నారు. అలాంటి వారి కోసం-

| | |
|---|---|
| *పత్రిక విడిప్రతి* | **: 5/-** |
| *ప్రత్యేక సంచిక (ఉగాది,దీపావళి)* | **: 10/-** |
| *సాలుసరి చందా* | **: 60/-** |

మీ ఏడాది చందాను మోనికా పబ్లికేషన్స్ పేరిట ఎం.ఓ. లేదా హైదరాబాద్‌లో చెల్లించే విధంగా డి.డి. ద్వారా పంపండి! ప్రత్యేక సంచికలకు, పోస్టల్ ఛార్జీలకు కాగల అదనపు వ్యయాన్ని చందా మొత్తంలో చేర్చడాన్ని పాఠకులు గుర్తించగలరు. దీనిని ప్రత్యేక రాయితీగా పరిగణించి, చందా మొత్తాన్ని వెంటనే ఈ క్రింది అడ్రసుకు పంపగలరు.

**మోనికా పబ్లికేషన్స్**

79బి, జర్నలిస్ట్ కాలనీ,

జూబ్లీహిల్స్, హైదరాబాద్-33.

అడగలేకపోయారా అన్నాడు కోపంగా వేణు.

సెభాష్ అంటూ రెండు చేతులు చప్పట్లు చరిచారు విశ్వనాథం.

చాలా బాగా చెప్పావు. వాళ్లకా మాత్రం తెలివితేటలు లేవు. నువ్వు పుట్టి ఇలా అడుగుతావనుకోలేదు. ముందుగా తెలిస్తే నిన్ను కనేవాళ్లు కాదేమో. ఎంత తెలివితక్కువగా ప్రవర్తించారు పాపం.

పెళ్లయి ఐదేళ్లయినా పిల్లలు కలగలేదని అంతా సూటిపోటి మాటలంటుంటే నీ తల్లి మౌనంగా భరించింది. గుడి గోపురాల చుట్టూ తిరిగి, ఒక్కపూట భోజనం చేసి, రాత్రిపూట వస్తుండేది ఎవరేది చెబితే అది నమ్మి. స్వాములవాళ్లు, తాయెత్తులంటూ మూఢనమ్మకాలను సైతం గౌరవించి ఎన్నో నోములు, వ్రతాలు చేసింది. భగవంతుడిచ్చిన వరమని నీకు జన్మను ప్రసాదించింది.

ప్రతి స్త్రీ సంతానం కోసం పడే పాట్లు అవే. దానికి ఎవరేం చేయగలరు అన్నాడు వేణు.

నువ్వు పుట్టాక నీకు ఏ లోటూ రాకుండా ఉండాలని ప్రతి పండక్కి నీకు కొత్త బట్టలు కొనేవాడు మీ నాన్న. మిల్లులో పని. వచ్చే జీతం చాలదు. చీకటిలో లేచి పేపర్ వేశాడు. ఇంటింటికీ వెళ్లి పాల ప్యాకెట్లు ఇచ్చి వచ్చేవాడు. సాయంత్రం మిల్లు నుంచి ఇంటికి రాగానే నీ చదువు కోసం డబ్బు చాలదని రాత్రి పొద్దుపోయేదాకా బట్టల దుకాణంలో పద్దులు వ్రాసేవాడు. అలా సంపాదించి నీకు డిగ్రీ వరకు చదువు చెప్పించగలిగాడు. ఉద్యోగమైనా నీ తెలివితేటలతో సంపాదించుకోగలిగావా. కొడుకు ఎక్కడ తనలాగా చిన్న ఉద్యోగం చేసి కష్టపడిపోతాడోనని, తెలిసిన పెద్దవాళ్ల చేత రికమండేషన్ చేయించాడు. ఇంటి మీద అప్పు తెచ్చి యాభై వేలిచ్చి నీకు ఉద్యోగం వేయించాడు. ఇదంతా వాళ్ల బాధ్యతే.

కొడుకుగా నీ కర్తవ్యాన్ని కూడా నిర్వర్తించుకోవాలి కదా. ఇంత చేసిన వాళ్లకు నువ్వు చూపించే ప్రేమాభిమానాలు ఏవీ? ఉద్యోగం రాగానే నచ్చిన అమ్మాయిని పెళ్లిచేసుకున్నావు. రెండు చేతులా సంపాదిస్తూ ఇద్దరు బిడ్డలతో సుఖంగా వున్నావు. ఈ వయసులో వాళ్లనలా దిక్కులేని అనాథలుగా వదిలివేయటం న్యాయమేనా. వేళకు గుప్పెడు మెతుకులు సంవత్సరానికి రెండు జతల బట్టలు ఇస్తే చాలు, వాళ్ల బ్రతుకులు తెల్లారిపోతాయి. కొడుకే కావాలని ఎందుకు కన్నారు. చివరి దశలో తలకొరివి పెడతావని.

సమాజాన్ని ఉద్ధరించటం కోసం, మంచిపేరు సంపాదించుకోవాలని గొప్ప గొప్ప పనులు చేస్తారు. కానీ ఏం లాభం. సొంత తల్లిదండ్రుల్నే పట్టించుకోలేరు. అటువంటి వాళ్లకి కన్నవాళ్ల ఆదరాభిమానాలు ఎలా గుర్తుకొస్తాయి.

ఇప్పుడు నా తల్లిదండ్రులకు ఏం లోటు చేశానని ఇలా మాట్లాడుతున్నారు. ఎపుడు పడితే అపుడు రావాలంటే వీలు కుదరదు కదా.

కన్న తల్లిదండ్రుల్ని చూడటానికి సమయం, సందర్భం, ఒక టైము అవసరం లేదు. ప్రేమ, ఆప్యాయతలు వుంటే చాలు. ఎంతో కొంత డబ్బులు పడేసి చేతులు దులుపుకోవటం కాదు. ప్రతి కొడుకూ ఒక తండ్రేనని మరచిపోకూడదు.

వేణుని చివాట్లు వేసి విశ్వనాథం గారు వెళ్లిపోయారు. వేణు కారులో వృద్ధాశ్రమానికి వెళ్లాడు.

అనాథలకు, వృద్ధులకు సేవలందిస్తున్నందుకు వేణుని అభినందిస్తూ పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అక్కడ చేరిన వృద్ధులంతా వాళ్లకో ఆశ్రయం కల్పించినందుకు ఎంతగానో పొగిడారు.

రాత్రి సభా కార్యక్రమం ముగిసి ఇంటికి వచ్చేసరికి చాలా ఆలస్యం అయింది. భోజనం చేసి పడుకున్నాడు. నిద్రలో కల వచ్చింది వేణుకి. ఆ కల వేణుకి కలవరాన్ని రేపి కలత పెట్టించింది. నిద్రలో ఉలక్కిపడి లేచాడు. నో... అలా జరగటానికి వీల్లేదు, నో అలా జరగటానికి వీల్లేదంటూ లేచి కూర్చున్నాడు. మంచం దిగి వెళ్లి మంచినీళ్లు త్రాగి వచ్చాడు. కల కలవరాన్ని రేపింది వేణు మనసులో. ఆ కలని తలచుకుంటేనే భయం వేస్తున్నది.

తను కష్టపడి సంపాదించినదంతా కొడుకు చదువు కోసం ఖర్చుపెడతాడు. ఇంకా పెద్ద

చదువులు చదువుతాను నాన్నా, అంటే ఎక్కడెక్కడో హాస్టల్లో వుంచి చదివిస్తాడు. ఇక్కడ ఈ చదువుకి ఉద్యోగం రాదు, అమెరికా వెళ్తానంటే ఉన్నదంతా ఖర్చుపెట్టి కొడుకు అమెరికాలో బాగా డాలర్లు సంపాదిస్తాడని ఇల్లు తాకట్టు పెట్టి అమెరికా పంపిస్తాడు. అక్కడ ఉద్యోగంలో సెటిలైన కొడుకు ఫోన్ చేస్తాడు తండ్రికి. మిమ్మల్ని చూడటానికి రావాలంటే వీలుపడదు. చాలా దూరంలో వున్నాను. ఇక్కడ అమ్మాయినే పెళ్లి చేసుకున్నాను. మిమ్మల్ని ఎవరూ చూసేవారు లేరనుకుంటే మీరు బాధపడాల్సిన పనే లేదు. ఎక్కడ చూసినా వృద్ధాశ్రమాలు చాలా వున్నాయి. అమ్మ, నువ్వు అందులో చేరండి. అవసరమైతే డబ్బు పంపిస్తానన్నాడు.

ఆ వయసులో తనకు కావల్సింది డబ్బు కాదు. తోడు, మనిషి తోడు కావాలి. మాట్లాడుకోవటానికి నా అనే వ్యక్తి కావాలి. తన ఆలనాపాలనా చూడటానికి తన రక్తం పంచుకుని పుట్టిన పిల్లలు కావాలి. డబ్బుతో బంధాలను కొనుక్కోలేం గదా. ఒక్కగానొక్క కొడుకు. దూరంగా వెళ్లిపోతే బ్రతకటం చాలా కష్టం. చివరి రోజుల్లో కొడుకు చేత తలకొరివి పెట్టించుకొనే అదృష్టం కూడా దక్కదు.

తెల్లవారే వరకూ నిద్రపోకుండా అలాగే కూర్చున్నాడు వేణు. తన కొడుకుని అమెరికా పంపదలచుకోలేదు. కొడుకుని వదిలి ఉండలేడు. అలాంటి కల తనకు రావటానికి కారణమేమిటో బాగా అర్థమైంది.

ఉదయం ఏడు గంటలకల్లా లేచి స్నానం చేసి భార్య అందించిన కాఫీ త్రాగి ఊరికి ప్రయాణమయ్యాడు. ఎక్కడికి వెళ్లేదీ భార్యకు కూడా చెప్పలేదు.

సాయంత్రం ఇంటిముందు ఆగిన కారులో నుంచి వేణు తన తల్లిదండ్రుల్ని చేయి పట్టుకుని లోపలికి తీసుకుని వచ్చాడు. ఈ రోజు నుంచి వాళ్లకి ఏ లోటూ రాకుండా చూసుకునే బాధ్యత నీదేనంటూ భార్యకి చెప్పాడు.

భర్త ప్రవర్తనలో మార్పుకి కారణం తెలుసుకుంది భార్య. ప్రతి తండ్రీ తన కొడుకు దగ్గరే ఉండాలని ఎందుకు అనుకుంటారో ఇప్పుడర్థమైంది వేణుకి. ఏదైనా తనదాకా వస్తే గానీ తెలియదు. వేణు ప్రతిరోజూ వృద్ధాశ్రమానికి వెళ్లి నిజంగా నష్టపోయిన వాళ్ల బిడ్డల గురించి అడిగి తెలుసుకుంటూ వాళ్ల మీద ఎంతో జాలిపడేవాడు. అక్కడికి చేర్చటానికి వచ్చిన మరికొంతమంది తల్లిదండ్రుల్ని కొడుకుల వద్దనే ఉంచుకోవాలని, అది వాళ్ల బాధ్యత అని తెలియజేసి, కొంతమందినైనా ఆ బంధాలకు దూరం కాకుండా చూసేవాడు. ●

## చినుకు

చినుకే కదాని
చులకనగా చూడకు
అది వర్షిస్తే అన్నం
అది అలిగితే కరవు!

చినుకు చిందితేనే సేద్యం
చినుకు పడకుంటే క్షామం
మట్టి బంగారం అయినా
శ్వేదం సస్యశ్యామలమైనా
మనిషి ప్రాణంతో వున్నా
నది జీవనదిగా నిలిచినా
మూలకారణం... చినుకే
సముద్రానికైనా అదే విత్తు!

ఆకుపచ్చగా ఉన్నా...
పువ్వు పరిమళించినా...
కోయిల కుహు కుహూ అన్నా...
మూగజీవం ప్రాణం పోసుకున్నా... చినుకే
చినుకే కదాని చులకనగా చూడకు!

అది వట్టి చినుకు కాదు
సృష్టికి అమృత బిందువు.

– పండా నాగేంద్ర త్రినాథ్